క్లుప్తంగా

పోలీస్‌శాఖ సేవలపై అవగాహన



ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి గ్రామంలో పోలీస్‌శాఖ సేవలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు కళా బృందం సభ్యులు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాటలు, నాటికల రూపంలో కల్తీ కల్లు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళల రక్షణ, సమాజ సేవ, చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్, వీడీసీ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

నిజామాబాద్ అర్బన్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్మూర్‌లో నిర్వహించే సన్నాహక సదస్సును పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు పోశెట్టి సోమవారం కోరారు. వికలాంగుల పింఛన్ పెంపు, పార్టీ సన్నాహక సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ రానున్నట్లు తెలిపారు. వికలాంగులు, బహుజనులు సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు తగవు

నిజామాబాద్ రూరల్: బీఆర్ఎస్ పార్టీ, మాజీ సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విమర్శలు తగవని జెడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి దాదాన్నగారి విఠల్ రావు సోమవారం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి 40 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించిందన్నారు. అలాంటి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వం అనవసర రాద్ధాంతం చేస్తోందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిజానిజాలు తెలియకుండా ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అనవసరంగా నోరు పారేసుకుంటున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జయకేతనం ఎగురవేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎవరైనా బీఆర్ఎస్ పార్టీ పై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

గస్తీ దళాల ఏర్పాటు

మోపాల్: మండలంలోని కులాస్‌పూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దొంగతనాల నివారణకు గస్తీ దళాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల గ్రామంలో ఒకేరోజు 11 తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. అన్ని కుల సంఘాల నుంచి ఇద్దరు చొప్పున రాత్రి 10 నుంచి ఉదయం 4 గంటల వరకు గస్తీ కాస్తున్నారు. అంతేగాకుండా అనుమానాస్పద వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారమిచ్చేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

సిరికొండ: తెలంగాణ విశ్వవిద్యాలయంలో చదివి డాక్టరేట్ సాధించిన తోటి మిత్రుడిని క్లాస్‌మేట్స్ ఘనంగా సన్మానించారు. మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన కర్క గణేశ్ 'ఎఫెక్ట్ ఆఫ్ సింటరింగ్ మెథడాలజీ ఆన్ స్ట్రక్చరల్, మాగ్నెటిక్ అండ్ ఎలక్ట్రికల్ ప్రాపర్టీస్ ఆఫ్ కాంపోసిట్ ఫెర్రైట్స్' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందాడు. గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 2007–08లో పదో తరగతి పూర్తి చేసిన అతడిని బ్యాచ్ మిత్రులు సన్మానించారు. డాక్టరేట్ సాధించినందుకు అభినందించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	100,700	వెండి(కిలో)	1,18,000
22 క్యారెట్స్	92,962	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	28	60	గాజరుగడ్డ	40	80
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	50	90
బీరకాయ	40	80	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	60	120	గోబిగడ్డ	15	30
కాకరకాయ	25	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	60	బీట్‌రూట్	25	50
పాలకూర	30	60	కరివేపాకు	40	80
మెంతికూర	30	60	చామగడ్డ	30	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	80
పుదీనా	50	90	గోరుచిక్కుడు	35	60
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్

తడి పొడి.. పర్యవేక్షణ కొరవడి

- ప్రజలకు చెత్తపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- మహిళా సంఘాల ద్వారా ప్రచారం నిల్



తడి–పొడిచెత్త వేరుచేసేదెలా..

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చెత్తపై ప్రత్యేక దృష్టి సారించడం లేదు. మొక్కుబడిగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సీడీఎంఏ అధికారులు వంద రోజుల ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రణాళిక కేవలం పేపర్లకే పరిమితమవుతోంది.చెత్త ఎలా సేకరించాలి అనే అంశంపై మహిళలకు అవగాహన కల్పించడంలో అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టిసారించడం లేదు. దీంతో చెత్తపై అవగాహన కరువైంది. నగరంలో ప్రతీరోజు వంద టన్నుల చెత్త తయారవుతోంది. ఈ చెత్తను ఇంటింటికి తిరిగి సేకరించి వాహనాల ద్వారా నాగారంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. అయితే చెత్త మొత్తం ఒకే చోట కాకుండా వేర్వేరుగా నిల్వ చేయాలి. తడి, పొడి, హానికరమైన చెత్తగా మూడు విభాగాలుగా విభజిస్తారు. తడి చెత్త అంటే ఇంట్లో పాచిపోయిన ఆహారపదార్థాలు, కుళ్లిపోయిన పండ్లు వంటివి. పొడి చెత్త అంటే పేపర్లు, పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు. హానికర చెత్త అంటే హాస్పిటల్స్‌లో వాడే సిరంజీలు, ఇంజక్షన్ బాటిళ్లు, ఆపరేషన్‌కు వాడే బ్లేడ్స్, కాటన్, ప్యాడ్ వంటివి. వీటిలో పై రెండు మున్సిపల్ సిబ్బంది తమ వాహనాల ద్వారా సేకరిస్తారు. మూడోది హానికరమైన చెత్త సేకరించేందుకు ప్రత్యేకమై ఏజెన్సీలు తమ వాహనాల ద్వారా చెత్త సేకరించి వారికి కేటాయించిన స్థలంలో నగరశివార్లలో వాటిని కాల్చివేసి, బూడిదను పూడ్చివేస్తారు.

తడి–పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. ప్రతి రోజు పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. అయితే గృహిణులు చెత్తను ఒకే బుట్టలో వేస్తున్నారు. దీంతో అదే చెత్తను కార్మికులు చెత్త వాహనంలో వేస్తున్నారు. దానిని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ అంశంపై అధికారులు అవగాహన కల్పించడం లేదు.

వేర్వేరు డబ్బాల్లో..

ప్రతి ఒక్కరు ఇంట్లో, దుకాణాల్లో తయారయ్యే చెత్తను వేర్వేరుగా నిల్వచేయాలి. వాటి కోసం ప్రత్యేకంగా రెండు బుట్టలు(డబ్బాలు) వాడాలి. ఈ అంశంపై గృహిణులకు అధికారులు అవగాహన కల్పించడం లేదు. పదేళ్ల క్రితం 2014లో నాటి ప్రభుత్వం ఇంటింటికి రెండు డబ్బాల(నీలి, ఆకుపచ్చరంగు)ను ఉచితంగా అందించింది. నాటి నుంచి ఇప్పటివరకు మళ్లీ డబ్బాలను పంపిణీ చేయలేదు. మహిళలకు చెత్తపై వివరించడం లేదు.

అవగాహన అవసరం

చెత్త తయారీ, చెత్త నిల్వలో మహిళలదే ప్రధాన భూమిక. వారికి అవగాహన కల్పించడం అధికారుల కంటే మహిళా సంఘాలదే ప్రధాన బాధ్యత. మహిళా సమాఖ్య, స్త్రీనిధి, స్వయం సహాయ సంఘాలు వంటి పలు సంఘాలు మెప్మా ఆధీనంలోనే ఉంటాయి. వీరంతా మహిళలే నిర్వహిస్తారు. కాబట్టి మహిళలకు, గృహిణులకు చెత్త నిల్వ, చెత్త సేకరణ వంటి అంశాలు వీరే వివరించాలి. ఈ విషయంలో బల్దియా అధికారులు, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో, డిప్యూటీ కమిషనర్ వంటి ఉన్నతాధికారులు దృష్టి సేకరించాలి. వారితో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఈ తడి–పొడిచెత్త వేర్వేరుగా సేకరించడం విజయవంతంగా సేకరించగలుగుతాం.

అవగాహన కల్పిస్తున్నాం



చెత్త సేకరణపై ప్రతిరోజు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. మహిళలకు అవగాహన కల్పించినా ఇంకా పూర్తిస్థాయిలో వివరించలేకపోతున్నాం. మెప్మా సంఘాలకు బాధ్యత అప్పగిస్తాం.

– రవిబాబు, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో

26 రోజుల పనిదినాలు కల్పించాలి



బీడీ కంపెనీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

డిచ్‌పల్లి: నెలలో 26 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం బీడీ కార్మికులు డిచ్‌పల్లి మండల కేంద్రంలోని శివాజీ బీడీ కంపెనీని ముట్టడించారు. ముందుగా బీడీ కంపెనీ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కంపెనీలోకి వెళ్లి బైఠాయించారు. కొద్దిసేపు ఆందోళన చేసిన అనంతరం కనసీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటి మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా బీడీ కార్మికులకు నెలకు 10 రోజుల పని మాత్రమే పని కల్పిస్తున్నారన్నారు. చేతినిండా పని లేక పోవడంతో బీడీ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం తక్షణం కార్మికులకు 26 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీ యూసీఐ ఏరియా కార్యదర్శి కిషన్, జిల్లా నాయకుడు మురళి, బీడీ టేకేదార్లు నర్సయ్య, సాయినాథ్, సుదర్శన్, శ్రీధర్, గణేశ్, రవి, కార్మికులు లక్ష్మి, సుజాత, నర్సయ్య, గౌతమి, జమున, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరవేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బుచ్చన్న, శ్రీధర్, ఆకుల జగన్, గౌసొద్దీన్, ఎల్లయ్య, కిశోర్‌గౌడ్, జీవన్, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి కాంగ్రెస్ బీసీ నాయకులు



రైలులో ఢిల్లీకి మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్తున్న బాడ్సి శేఖర్ గౌడ్



సిరికొండ నాయకులు

మోపాల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈ నెల 5, 6 తేదీల్లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి బీసీ నాయకులు సోమవారం తరలివెళ్లారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, వాకిటి శ్రీహరితో కలిసి టీపీసీసీ డెలిగేట్, నిర్మల్ జిల్లా పరిశీలకుడు బాడ్సి శేఖర్ గౌడ్ హైదరాబాద్ నుంచి ఢిల్లీకి రైల్‌లో బయలు దేరారు. వీరి వెంట బీసీ నాయకులు ఉన్నారు.

సిరికొండ: మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు దేశ రాజధాని ఢిల్లీకి సోమవారం వెళ్లారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ధర్నాలో పాల్గొనడానికి వారు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి, దేగాం సాయన్న, ఉమ్మాజి నరేశ్, డీలర్ రమేశ్, బడాల మహిపాల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి



మోపాల్: విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మోపాల్ మండలంలోని సిర్‌పూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో 400 నోట్ బుక్స్, 200 పెన్నులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గత 21 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు అమర్, రామ్మోహన్, టీఎస్ వ్యాస్, ఉపాధ్యాయులు నాగమణి, రాము, అనురాధ, గంగాప్రసాద్, వీడీసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలకు బయల్దేరిన నాయకులు



మహాసభలకు బయలుదేరుతున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: గోవాలో నిర్వహించే జాతీయ బీసీ మహాసభలకు జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం బస్సులో బయలుదేరారు. బీసీ నేతల ప్రయాణాన్ని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. బీసీ మేలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. బీసీలు అన్ని రంగాల్లో రాణించాలంటే 42శాతం రిజర్వేషన్లు రావాల్సిందేనన్నారు. బీసీలు సామాజిక ఇంజినీర్లు అని గ్రంథాలయ చైర్మన్ అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, ఆకుల ప్రసాద్, బుస్స ఆంజనేయులు, పొల్కం గంగాకిషన్, దర్శనం దేవేందర్, మాడవేడి వినోద్, కొయ్యాడ శంకర్, శ్రీలత, బగ్గలి అజయ్, చంద్రకాంత్, నారాయణ రెడ్డి, కోడూరు స్వామి, బసవ సాయి, అన్నయ్య, విజయ్, జయ, రుక్మిణి, మహేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ



ధర్పల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు, కాంగ్రెస్ నాయకులు నూతన రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని రాని వారు ఆందోళన చెందవద్దని అధికారులు పేర్కొన్నారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య లేకుండా చూడండి



ట్రాన్స్‌కో ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో సాగు కు నెలకొన్న విద్యుత్ సమస్య తీర్చాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్‌ను సోమవారం ఫోన్‌లో కోరారు. పడగల్‌లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదని, దాంతో మొక్కజొన్న పంట ఎండిపోయే పరిస్థితి నెలకొందని స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గత కొద్ది రోజులుగా ఒకవైపు ఆరుగంటలు, మరోవైపు ఆరుగంటలు కరెంటు సరఫరా ఇస్తున్నారని దీంతో పంటలకు నీరు సరిగ్గా అందక ఎండిపోయే ప్రమాదముందని ఎమ్మెల్యే వేముల ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. రైతులు సబ్‌స్టేషన్‌కు వెళ్లి అడిగితే లో వోల్టేజి సమస్య ఉందని, 3 కెపాసిటర్ సెల్స్, 4 బ్యాటరీలు ఉంటే సమస్య పరిష్కారం అవుతుందని చెబుతున్నారన్నారు. మెటీరియల్ అందజేసి రైతులకు విద్యుత్ సమస్య లేకుండా చూడాలని ఎస్.ఈ.కి ఎమ్మెల్యే సూచించారు.

క్రీడా పోటీలకు సంసిద్ధం చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలంలో త్వరలో నిర్వహించబోయే అంతర పాఠశాలల మండల క్రీడా పోటీలకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను సంసిద్ధం చేయాలని ఎంఈవో రాజ గంగారం సూచించారు. ఆర్మూర్ ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం పీడీ, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. సీనియర్ పీడీలు గోపి రెడ్డి, మల్లేష్ గౌడ్, గంగాధర్, నిఖిత, కిరణ్ పాల్గొన్నారు.

'ప్రజలే తగిన బుద్ధి చెబుతారు'



మాట్లాడుతున్న మార చంద్రమోహన్

ఆర్మూర్‌టౌన్: జనహిత పాదయాత్రకు లభించిన విశేష జనదారణను జీర్ణించుకోలేని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మారచంద్రమోహన్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్ ఎద్దేవా చేశారు. పాదయాత్ర విజయంతం కావడాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను గుర్తించడానికి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర చేపట్టారన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకులపై మరోసారి నోరు జారితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ విఠ్ఠం జీవన్, కాంగ్రెస్ నాయకులు చిన్నా రెడ్డి, పండిత్ పవన్, ఫయాజ్, మాజిద్, రేగుల సత్యనారాయణ, భూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత



గిరిరాజ్ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల, తపస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్స్, విద్యార్థులు సోమవారం గిరిరాజ్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తపస్ ఫౌండేషన్ అధ్యక్షుడు విపుల్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ నరేశ్, నాగజ్యోతి, దస్తప్ప, రజిత, వెంకటరమణ, సుధాకర్, పీఆర్వో దండు స్వామి, రంజిత, వినయ్ కుమార్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ రామస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిద్ధి యోగా భవన్‌లో..



మొక్కలు నాటుతున్న సభ్యులు

నిజామాబాద్ రూరల్: వినాయక్‌నగర్‌లోని సిద్ధి యోగా భవన్‌లో ఇందూరు జిల్లా భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగా సమితి, కిసాన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆయుర్వేద ఔషద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇంజినీర్ గంగాధర్, బుచ్చన్న, కిషన్, లింబాద్రి, నాగరాజు, గంజి సాయన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రఘురాం

డిచ్‌పల్లి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం డిమాండ్ చేశారు. సోమవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్పీఆర్ జూనియర్ కళాశాలలో నవీన్ అధ్యక్షతన నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ రూరల్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ రూరల్ నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, నాయకులు నవీన్, కృష్ణ, మహిపాల్, అబ్దుల్, కుమార్, విజయ్, శశికాంత్, చరణ్, విక్రమ్, నితిన్, శివ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించాలని వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దేవునగర్ క్యాంప్ వాసులు

డిచ్‌పల్లి: ప్రతి నెలా పింఛన్ పంపిణీ ప్రారంభం కాగానే ముందుగా తమకు అందించేలా చూడాలని డిచ్‌పల్లి మండలం దేవునగర్ క్యాంప్, దేవుపల్లి క్యాంప్ గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో రాజీవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ గ్రామస్తుల్లో ఎక్కువ మంది గతంలో కుష్టు వ్యాధికి గురవడం వలన వేలి ముద్రలు నమోదు కావని ఎంపీడీవోకు వివరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన చేయూత పెన్షన్ ఫేస్ రికగ్నయిజ్ యాప్ లో సైతం తాము సమస్య ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దేవునగర్ క్యాంప్ కు ప్రత్యేకంగా ఒక బీపీఎంను కేటాయించాలన్నారు. పై అధికారులతో మాట్లాడి తమ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ ఖతిజా యూసుఫ్ కోరారు. స్పందించిన ఎంపీడీవో వెంటనే డీఆర్‌డీవోతో పాటు, డిచ్‌పల్లి ఎస్పీఎం తో మాట్లాడి సమస్యను వివరించారు. వచ్చే నెల నుంచి పింఛన్ పంపిణీ ప్రారంభం కాగానే ముందుగా దేవునగర్ క్యాంప్ వారికి ఇవ్వాలని తపాలా శాఖ వారికి, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

డిచ్‌పల్లి సీఎంసీ పాస్టరేట్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో జయానంద్, ఏసుపాదం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి సీఎంసీ పాస్టరేట్ కమిటీని సభ్యులు ఆదివారం రాత్రి ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆరుగురు పోటీ పడగా కమిటీ సభ్యులుగా మెట్టు శ్యాంసన్ దైవాశీర్వాదం, ముల్కల డానియల్ సురానా, మద్దెల ప్రశాంత్‌రాజ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సీఎంసీ మినిస్టీరియల్ సెక్రటరీ జయానంద్, ప్రెసిబిటర్ ఇన్‌చార్జి ఏసుకుమార్, సహాయకులుగా దినకర్, స్టీవెన్ కుమార్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి జయానంద్ మాట్లాడుతూ.. డిచ్‌పల్లి సీఎంసీ పాస్టరేట్ కమిటీ ఎన్నికల్లో ముగ్గురు సభ్యులుగా ఎన్నికైనట్లు తెలిపారు. సీఎస్ఐ మెదక్ డయాసిస్ ద్వారా మరో ఇద్దరు సభ్యులను నామినేషన్ విధానంలో నియమిస్తారని వివరించారు. నూతనంగా ఎన్నికైన శ్యాంసన్, డేనియల్ సురానా, ప్రశాంత్‌రాజ్ లను సభ్యులు ఘనంగా సన్మానించారు.

దేశాభివృద్ధి కోసం పని చేయాలి



సభ్యత్వ నమోదులో నాయకులు

డిచ్‌పల్లి: విద్యార్థులు జాతీయ భావాలతో, దేశం కోసం, దేశాభివృద్ధి కోసం పని చేయాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బి.శివ పిలుపునిచ్చారు. సోమవారం ఏబీవీపీ డిచ్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎస్పీఆర్ ఇంటర్, డిగ్రీ కళాశాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అని విద్యారంగ సమస్యలు, విద్యార్థుల కోసం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఏబీవీపీలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెయూ ఏబీవీపీ సెక్రెటరీ సమీర్, నాయకులు లెనిన్, అనిల్, నెహ్రూ, రామకృష్ణ, హర్షనందన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత



అర్గుల్‌లో లబ్ధిదారులతో ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గల్ఫ్ పాలసీ పథకం ద్వారా ఇందల్వాయి మండలానికి చెందిన ముగ్గురికి మంజూరైన రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియాను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అర్గుల్‌లో సోమవారం అందజేశారు. గన్నారంకు చెందిన కొషెట్టు లక్ష్మి, చంద్రాయన్‌పల్లికి చెందిన బండ్ల సుజాత, అన్సాన్‌పల్లికి చెందిన షేక్ హసీన వీరి భర్తలు గతంలో గల్ఫ్‌లో మృతి చెందగా పరిహారం మంజూరైనట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్ తెలిపారు. గల్ఫ్ బాధిత కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ పాలసీని అమలు చేయడం గొప్ప విషయమని అన్నారు. పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.